ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 7-3-2025 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. SLBC సొరంగంలో చిక్కుకున్న కార్మికుల ఆచూకీ కోసం జరుగుతున్న సహాయ క చర్యల్లో భాగంగా ఈరోజు IIT మద్రాస్ ఆధ్వర్యంలో నలుగురు రోబోటిక్ నిపుణులు గాలింపు చేపట్టారు.
2. రాష్ట్ర ఆర్టీసీ ఉద్యోగులకు 2.5 శాతం డిఏ ప్రకటిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.
3. కేంద్ర సమాచార , ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మొట్టమొదటి ప్రపంచ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ –WAVES మే నెల లో ముంబైలో నిర్వహించనున్నారు.
4. తెలంగాణ తొలి పర్యాటక విధానం- 2025కు, యాదగిరిగుట్ట ఆలయానికి స్వయం ప్రతిపత్తి కల్పించేలా ప్రత్యేక ట్రస్ట్ బోర్డు ఏర్పాటు వంటి పలు నిర్ణయాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

**SLBC-చర్యలు**

నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంటలో SLBC సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికుల ఆచూకీ కోసం సహాయక చర్యలు 14వ రోజు కూడా కొనసాగుతున్నాయి. ఈరోజు IIT మద్రాస్ కు చెంన నలుగురు రోబోటిక్ నిపుణులు సొరంగంలోకి వెళ్లారు. నిన్న ఒకసారి రోబోటిక్ నిపుణులు సొరంగం లోపల పరిసరాలను పరిశీలించి వచ్చారు. ఈరోజు మరోసారి పరిస్థితులను గమనించి అన్వీ రోబోటిక్ సాయాన్ని తీసుకున్నారు. అంతకుముందు కార్మికుల ఆచూకీ క్యాడవర్ శునకాల బృందం ఈ ఉదయం సొరంగం లోకి వెళ్లింది. మరోవైపు

శిధిలాలను తవ్వేందుకు అవసరమైన సామగ్రిని లోకోమోటర్ తీసుకెళ్లింది. సామగ్రితో పాటు 110 మంది సిబ్బంది లోనికి వెళ్లారు. అన్వేషణ అనంతరం ఈ బృందం మధ్యాహ్నం టన్నెల్ నుంచి తిరిగి రానుంది కాగా , నాగర్ కర్నూల్ జిల్లా కలక్టర్ బదావత్ సంతోష్ , పోలీసు సూపరింటెండెంట్ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ తో కలిసి సహాయక చర్యలను పరిశీలిస్తున్నారు. సొరంగం లోపలి సమాచారం తెలుసుకొని సిబ్బందికి అవసరమైన సహకారం అందిస్తున్నారు. (PTC నాగర్‌కర్నూల్ జిల్లా)

**ఆర్టీసీ ఉద్యోగులకు 2.5 శాతం డిఏ**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ-ఆర్టీసీ ఉద్యోగులకు 2.5 శాతం డిఏ ప్రకటిస్తున్నట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 2.5 శాతం డీఏ వల్ల ఆర్టీసీ పై ప్రతి నెల 3.6 కోట్ల రూపాయల భారం పడనుందని వెల్లడించారు. మహాలక్ష్మి పథకం ప్రారంభించిన తరువాత ఇప్పటి వరకు 150 కోట్ల మంది మహిళలు దాదాపు 5 వేల కోట్ల రూపాయలు విలువైన ప్రయాణాన్ని ఉచితంగా చేశారని చెప్పారు. మహాలక్ష్మి పథకం ప్రారంభం తర్వాత మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని , దాదాపు ప్రతి రోజు 14 లక్షల మహిళలు అదనంగా ప్రయాణం చేస్తున్నారని మంత్రి వెల్లడించారు. కాగా, మహిళా దినోత్సవం సందర్భంగా ఇందిరా మహిళా శక్తి బస్సులను ప్రభుత్వం రేపు ప్రారంభించనుంది. మొదటి దశలో 150 బస్సులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క రేపు లాంఛనంగా ప్రారంభిస్తారు.

(పీఎన్)

**వేవ్స్ సమ్మిట్**

కేంద్ర సమాచార,ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మొట్టమొదటి ప్రపంచ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ –WAVES మేలో ముంబైలో జరుగుతుంది. మంత్రిత్వ శాఖ 'మానసపుత్రిక' గా భావించే ఈ సదస్సు ప్రసార మాధ్యమాలు , వినోద పరిశ్రమలో ప్రధాన

మైలు రాయిగా నిలుస్తుందని భావిస్తున్నారు. ఈ సదస్సు సందర్భంగా దేశ వ్యాప్తంగా యువతలోని ప్రతిభా పాటవాలను వెలికితీసేలా, ఈ- గేమింగ్, ట్రైలర్స్, ఎక్స్ టెండెడ్ రియాలిటీ తదితర అంశాలలో పోటీలు నిర్వహిస్తారు. ఎక్స్ టెండెడ్ రియాలిటీ హ్యాకథాన్ లో ఇప్పటికే తుది రౌండ్ కు చేరిన చెన్నైకి చెందిన బాల సుబ్రమణియన్ ఈ అంశంలో తమ కృషిని , అనుభవాలను వివరిస్తారు. వైద్యం, క్రీడారంగ నిపుణులకు ఎక్స్ టెండెడ్ రియాలిటీ వల్ల కలిగే ప్రయోజనం గురించి వివరిస్తారు.

(ఇంగ్లిష్ బైట్)

(ఎంఎస్ఎం)

**రాష్ట్రపతి భవన్ కు గుస్సాడి కనకరాజు బృందం**

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రపతి భవన్ లో ఈనెల 9వ తేదీ వరకు జరుగుతున్న అమృత్ మహోత్సవం వేడుకల్లో ప్రదర్శన ఇచ్చేందుకు ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన దివంగత గుస్సాడి కనకరాజుకు చెందిన మాస్టర్ కనక సుదర్శన్ ఆధ్వర్యంలోని బృందం ఢిల్లీ బయల్దేరింది. ఈ సందర్భంగా సుదర్శన్ జాతీయ స్థాయిలో నిర్వహించే వేడుకల్లో తమకు అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే కనకరాజుకు పద్మశ్రీ రావడం , గణతంత్ర దినోత్సవ వేడుకల్లో గిన్నిస్ బుక్ లో గుస్సాడికి చోటు లభించగా , ఇప్పుడు జాతీయస్థాయిలో మరోసారి తమ ప్రతిభ చూపే అవకాశం రావడం తమ బాధ్యతను మరింత పెంచింద ని ఆయన పేర్కొన్నారు.

(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

**మంచిర్యాల- పత్తి కొనుగోళ్లు**

మంచిర్యాల జిల్లా చెన్నూరులో నేటి నుంచి వారం రోజులపాటు పత్తి కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని స్థానిక ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఈరోజు చెన్నూరులో

విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సాంకేతిక సమస్యల కారణంగా నిలిచిన పత్తి కొనుగోలు ప్రక్రియ నేటి నుంచి తిరిగి ప్రారంభం అవుతుంది అన్నారు.

(ఎమ్మెల్యే వివేక్ సౌండ్ బైట్)

(పీటిసి, మంచిర్యాల జిల్లా)

**అశ్వినీ వైష్ణవ్ – మహబూబ్ నగర్**

కేంద్ర రైల్వే , సమాచార, కమ్యునికేషన్స్ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ రేపు మహబూబ్ నగర్ జిల్లాలో పర్యటిస్తారు. మహబూబ్ నగర్ నగరపాలక సంస్థ పరిధి దివిటిపల్లిలోని అమరరాజా బ్యాటరీ కంపెనీ గిగా పరిశ్రమకు రేపు ఉదయం భూమిపూజ చేయనున్నారు. అనంతరం అమరరాజా బ్యాటరీ ప్యాకింగ్ సదుపాయాల పరిశీలించిన తర్వాత మధ్యాహ్నం తిరిగి హైదరాబాద్ కు బయల్దేరి వెళ్తారు.

(పీటీసీ, MAHABUBNAGAR)

**బ్రేక్**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు వింటున్నారు. మరిన్ని updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్" handle @ air news_hyd ని ఫాలో అవండి . AIR News Hyderabad YouTube Channel ని సబ్ స్క్రైబ్ చేయండి.

**బీఆర్ఎస్-కేసీఆర్ సమావేశం**

బీఆర్ ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు ఈ రోజు సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో పార్టీ కీలక నేతలతో సమావేశం అయ్యారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ కార్యక్రమాలు , సంస్థాగత అంశాలపై చర్చిస్తున్నారు. ఈ సమావేశంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక

రామారావు,  ఎమ్మెల్యేలు హరీశ్‌రావు ,  తలసాని శ్రీనివాస్ యాదవ్  ,   వేముల ప్రశాంత్‌రెడ్డి , జగదీశ్‌రెడ్డి,  ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత  ,  పార్టీ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

(డెస్క్)

**నిర్మల్-మహిళా కానిస్టేబుళ్లు**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని నిర్మల్ జిల్లా   సూపరింటెండెంట్ జానకి షర్మిల మహిళా కానిస్టేబుళ్లకు తొలిసారి కొత్త బాధ్యతలు అప్పగించారు. నిన్న మహిళా కానిస్టేబుళ్లకు బ్లూ కోర్ట్  ,  డయల్  100,  పెట్రోలింగ్,  గస్తి విధులు   నిన్న  అప్పగించారు. ఈ బాధ్యతలను వారు విజయవంతంగా నిర్వహించడంతో రాష్ట్ర డిజిపి జితేందర్ జిల్లా ఎస్పీ జానకి షర్మిలను అభినందించారు. ఇక నుంచి వారానికి ఒకసారి మహిళా కానిస్టేబుళ్లకు ఈ బాధ్యతలు అప్పగిస్తామని ఎస్పీ జానకి షర్మిల ప్రకటించారు.

(పిటిసి నిర్మల్ జిల్లా)

**క్యాబినేట్ నిర్ణయాలు**

తెలంగాణ తొలి పర్యాటక విధానం-   2025కు,  యాదగిరిగుట్ట ఆలయానికి స్వయం ప్రతిపత్తి కల్పించేలా ప్రత్యేక ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది.  బలహీన వర్గాలకు స్థానిక సంస్థల్లో    42  శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపి  ,  విద్యా,  ఉద్యోగ రంగాల్లో కూడా బీసీలకు    42  శాతం రిజర్వేషన్లు కల్పించాలని మంత్రిమండలి తీర్మానించింది. వచ్చే శాసనసభ సమావేశాల్లో ఇందుకు సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ సిఫారసులను మంత్రి   మండలి ఆమోదిం చి,  దీనిపై శాసనసభలో బిల్లును ప్రవేశపెట్టాలని తీర్మానించింది.  ఈ మేరకు సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన నిన్న జరిగిన మంత్రి మండలి సమావేశంలో కీలక నిర్ణయాలను ఆమోదించారు.

(పీఎన్)

**ధర్మపురి-బ్రహోత్సవాలు**

జగిత్యాల జిల్లాలోని ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈనెల 10 వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల కోసం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నిరకాల ఏర్పాట్లు - ఉచిత అన్నప్రసాద వితరణ కు ఏర్పాట్లు చేస్తున్నామని ధర్మపురి దేవస్థానం ఈఓ శ్రీనివాస్ ఆకాశవాణికి తెలిపారు.

**(సౌండ్ బైట్ ఆలయ ఈఓ శ్రీనివాస్)**

(జగిత్యాల జిల్లా, పీటీసీ )

**సింగరేణి –బెల్లంపల్లి జీఎం**

సింగరేణి ఉత్పత్తి లక్ష్యాల దిశగా కార్మికులు కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి అన్నారు. జిల్లాలోని రెబ్బెన మండలంలోని ఖైరిగూడ ఓపెన్ కాస్ట్ గనులను పరిశీలించి ఫిబ్రవరిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 13 మంది ఉద్యోగులకు బహుమతులు అందించారు. ఆర్థిక సంవత్సర లక్ష్యాలు సాధించే దిశగా ప్రయత్నాలు చేయాలన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని గనులు పెరగనున్నట్లు తెలిపారు.

(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

**సింగరేణి-పనివేళలు**

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని సింగరేణి ఓపెన్ కాస్ట్ గనులు మొదటి, రెండో షిఫ్టులలో పని వేళలు కుదించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. ఎండ తీవ్రత ను దృష్టిలో ఉంచుకొని పని వేళల్లో మార్పులు చెయ్యాలని యజమాన్యానికి లేఖ రాసినట్టు తెలిపారు. సింగరేణి గనుల వద్ద కార్మికులకు మజ్జిగ ప్యాకేట్లు పంపిణీ చేయాలన్నారు.

(పిటిసి, మంచిర్యాల జిల్లా)

**సిరిసిల్ల-సూర్యఘర్**

రాజన్న సిరిసిల్ల జిల్లా  సహకార విద్యుత్ సరఫరా సంఘం-సెస్ పరిధిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పునరుత్పాదక సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్స హించే లక్ష్యంతో సూర్యఘర్, ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని సద్వినియోగం  చేసుకోవాలని, సిరిసిల్ల 'సెస్' మేనే జింగ్ డైరెక్టర్ విజయేందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని నివాస గృహాల పైకప్పులపై సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకునే వారికి రాయితీ వర్తిస్తుందని వెల్లడించారు.

(పిటిసి రాజన్న సిరిసిల్ల జిల్లా)

**సూర్యాపేట జిల్లా –జైలు శిక్ష**

సూర్యాపేట జిల్లాలో మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 31 సంవత్సరాల జైలు శిక్ష, 30 వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ఒకటవ అదనపు సెషన్స్ కోర్టు తీర్పునిచ్చిందని ఎస్పీ సన్ ప్రీత్సింగ్ తెలియజేశారు. నేరస్థుడికి శిక్ష పడేలా కృషి చేసిన అధికారులను SP అభినందించారు.

(Suryapet/PTC)

**ఎల్ ఆర్ ఎస్  సంగారెడ్డి కలెక్టర్**

అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణ- ఎల్ఆర్ఎస్ కు ఈనెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకుంటే 25 శాతం రాయితీ లభిస్తుందని సంగారెడ్డి జిల్లా కలెక్టర్  క్రాంతి వల్లూరు అన్నారు. జిల్లా కలెక్టరేట్ లో హెచ్ఎండిఏ పరిధి , జిల్లాలోని మున్సిపాలిటీల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.  క్రమబద్ధీకరణకు  రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనుమతిలేని లే అవుట్ల క్రమబద్ధీకరణలో గతేడాది

సెప్టెంబర్ లో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తులు క్రమబద్ధీకరణ చేయనున్నట్లు తెలిపారు.

(పీటీసీ, సంగారెడ్డి)

వాతావరణం

రాష్ట్రంలో రానున్న వారం రోజుల పాటు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రానున్న మూడు రోజుల్లో అక్కడక్కడ ఉదయం వేళల్లో పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. రెండు రోజుల పాటు గరిష్ట , కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు తక్కువగా ఉండే అవకాశం ఉందని , ఆ తర్వాత 2 నుంచి 3 డిగ్రీల మేర పెరగవచ్చునని అంచనా వేసింది.

(డెస్క్)

**ఎండ్ ...**

ఆకాశవాణి వార్తలు ఇంతటితో సమాప్తం. తిరిగి 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు వింటారు.